# కాంగ్రెస్ వస్తే కుక్కలు చింపిన విస్తరే

- అభివృద్ధి చేసే కేసీఆరా.. అబద్ధాల కాంగ్రెస్సా..?
- ఆలోచించి ఓటు వేయండి
- గర్శకుర్తి మండల ఆకాంక్షను నెరవేర్చుతాం
- జనవరిలోనే బతుకమ్మ చీరలకు ఆర్డర్ ఇస్తాము
- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- కారుకు ఓటేసి.. రైతు రాజ్యానికి జై కొట్టండి
- చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- గర్శకుర్తిలో ఎన్నికల ప్రచారం



గులాబీమయమైన గర్శకుర్తి బీటీ చౌరస్తా

గంగాధర, నవంబర్ 6: 'తెలంగాణను అభివృద్ధి చేసే కేసీఆర్ కావాలా..? అబద్ధాల కాంగ్రెస్ కావాలా..? కాంగ్రెస్ వస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అవుతది. ప్రజలు ఆలోచించి, ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలి' అని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రజల అభీష్టం మేరకు గర్శకుర్తి మండల ఆకాంక్షను నెరవేర్చుతామని, కొన్ని సాంకేతిక సమస్యలతో మండలం ఏర్పాటు ఆలస్యమైందని వివరించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు అందించే బతుకమ్మ చీరల తయారీకి జనవరి నెలలోనే ఆర్డర్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. మండలంలోని గర్శకుర్తి గ్రామంలో చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు మంగళ హారతులతో స్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణ వస్తే కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాలని అప్పటి పాలకులు ఎద్దేవా చేశారని గుర్తు చేశారు. దమ్ముంటే ఇప్పుడు రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి కరెంట్ తీగలపై బట్టలు ఆరేయాలని సవాల్ విసిరారు. తెలంగాణ వచ్చిన తర్వాత విద్యాభివృద్ధికి వెయ్యి గురుకులాలు, 33 జిల్లాలో 33 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డెబ్బై ఏండ్లల్లో వైద్య విద్యలో ఎన్నడూ, ఎక్కడా జరగని అద్భుతాన్ని తెలంగాణలో పదేండ్లలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఆవిష్కరించిందన్నారు. రైతుబీమా మాదిరిగా ప్రతి కుటుంబానికి ధీమా పేరుతో రూ.5 లక్షల బీమా వర్తించేలా సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడారు. ప్రజా సంక్షేమ పార్టీ బీఆర్ఎస్ అయితే, స్కాముల పార్టీ కాంగ్రెస్ అని, మత రాజకీయాల పార్టీ బీజేపీ అని ఏదీ కావాలో ప్రజలే ఆలోచించుకోవాలని అభ్యర్థించారు. నవంబర్ 30న కారు గుర్తుకు ఓటు వేసి రైతు రాజ్యానికి జై కొట్టాలని విజ్ఞప్తి చేశారు. రేవంత్‌రెడ్డి తెలంగాణలో రైతులకు మూడు గంటల కరెంటు చాలని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు వద్దు అంటూ వ్యవసాయాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక పరిస్థితి వస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికలప్పుడూ వచ్చే నాయకులను నమ్మవద్దని, నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ అభివృద్ధి చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో రాష్ట్ర నాయకుడు కొత్త జైపాల్‌రెడ్డి, ఎంపీపీ శ్రీరాం మధుకర్, సింగిల్ విండో చైర్మన్లు వెలిచాల తిర్మల్‌రావు, దూలం బాలగౌడ్, ఆర్బీఎస్ మండల కో-ఆర్డినేటర్ పుల్కం గంగన్న, పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు అలువాల నాగలక్ష్మీతిరుపతి, మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, ఎండీ నజీర్, ఎంపీటీసీలు తడిగొప్పుల రజితా రమేశ్, కోలపురం లక్ష్మణ్, అట్ల రాజిరెడ్డి, నాయకులు ఆకుల మధుసూదన్, అట్ల శేఖర్‌రెడ్డి, రామిడి సురేందర్, రేండ్ల శ్రీనివాస్, మామిడిపెల్లి అఖిల్, దూస అనిల్ కొమురయ్య, మహేందర్, పల్ల మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాశ్రేయస్సు కోసమే చేరికలు

- జైపాల్‌రెడ్డితో బీఆర్ఎస్ బలం మరింత పెరిగింది
- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



గర్శకుర్తిలో జైపాల్‌రెడ్డిని అభినందిస్తున్న ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

గంగాధర, నవంబర్ 6: ప్రజాశ్రేయస్సు కోసమే కొత్త జైపాల్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరాడని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని గర్శకుర్తిలో చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు కొత్త జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి వినోద్‌కుమార్, రవిశంకర్ బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడారు. కొత్త జైపాల్‌రెడ్డి చేరికతో కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు మరింత బలం పెరిగిందన్నారు. పెద్దఎత్తున యువత పార్టీలో చేరడంతో చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు తిరుగులేదని ధీమా వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్‌లోకి ఎస్‌యూ జేఏసీ చైర్మన్

- మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో చేరిక



చైతన్యకు బీఆర్ఎస్ కండువా కప్పుతున్న కేటీఆర్

కమాన్‌చౌరస్తా, నవంబర్ 6: శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నమల్ల చైతన్య, యూనివర్సిటీకి చెందిన విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్ ఐటీ శాఖ మంత్రి కేటీ రామారావు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్న బీఆర్ఎస్ సర్కారు పనితీరు చూసి విద్యార్థి సంఘాల నాయకులు పార్టీలో చేరడం మంచి పరిణామం అన్నారు. ఇక్కడ చెన్నమల్ల చైతన్య మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, ఆ అభివృద్ధిని ఇలానే కొనసాగించాలనే లక్ష్యంతోనే బీఆర్ఎస్‌లోకి వస్తున్నట్లు చెప్పారు. వారు బాధ్యతగా ఏ పని అప్పగించినా నిస్వార్థంగా పని చేస్తామని చెప్పారు. ఈ క్రమంలోనే తనతో పాటు 50 మందికి పైగా విద్యార్థి సంఘాల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్, శాతవాహన యూనివర్సిటీ జేఏసీ నాయకులు శనిగరం అరుణ్ కుమార్, గడ్డమీద రాజశేఖర్, గడ్డమీది రాకేశ్, ముల్కల విజయ్, కేయూ జేఏసీ నాయకులు సూర రాముయాదవ్, నంగునూరు చంద్రశేఖర్, బసవరాజు అభిలాష్, బండ అశోక్ తదితరులు ఉన్నారు.



మహిళల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కమలాకర్

# ఆడబిడ్డలు ఆశీర్వదించండి

- సమైక్య పాలనలో తాగునీటి కోసం గోసపడ్డాం
- మహిళలు ట్యాంకర్ల వద్ద యుద్ధాలు చేసేటోళ్లు
- స్వపరిపాలనలో ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు
- కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- మహిళల ఆత్మీయ సమ్మేళనం

కార్పొరేషన్, నవంబర్ 6: 'సమైక్య పాలనలో తాగునీటి కోసం కష్టపడ్డ రోజులు ఇప్పటికీ గుర్తున్నాయి. ట్యాంకర్ల వద్ద యుద్ధాలు చేసిన దృశ్యాలు కండ్ల ముందే కదులుతున్నాయి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. స్వపరిపాలనలో ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నయి. ఆడబిడ్డలు ఆశీర్వదించి గెలిపిస్తే నగరాన్ని మరింతగా అభివృద్ధి చేస్తా' అని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ మహిళలను అభ్యర్థించారు. సోమవారం స్థానిక పద్మనాయక కళ్యాణ మండపంలో మహిళల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడారు. కష్టపడి పని చేసి మనల్ని మనమే నిరూపించుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో బ్యూటీషియన్లకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. నగరంలో డ్రైనేజీలు, రోడ్లను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో వేలాది కోట్ల నిధులు తీసుకొచ్చి కరీంనగరాన్ని గొప్పగా అభివృద్ధి చేశానన్నారు. కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్‌తో నగరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. పర్యాటక రంగంతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గతంలో కరీంనగర్ రావాలంటే భయపడే రోజులు ఉండేవని, ఇక్కడికి బదిలీపై రావడానికి పనిష్మెంట్‌గా భావించేవారని వాపోయారు. పదేండ్ల క్రితం కరీంనగర్ ఎలా ఉందో..? ఇప్పుడు ఎలా ఉందో? ఆలోచించుకోవాలన్నారు. హ్యాట్రిక్ విజయాలు కట్టబెట్టిన కరీంనగర్ ప్రజలకు రుణపడి ఉంటానని తెలిపారు. సీఎం కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ సురక్షితంగా ఉంటుందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను ఢిల్లీ పార్టీలు, ఆంధ్రోళ్ల చేతుల్లో పెట్టొద్దని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, సంఘం నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి పట్టం కట్టాలి

- ఒక్కసారి అవకాశం ఇవ్వండి
- అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తా
- పని చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి
- జమ్మికుంటను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతా
- బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడికౌశిక్‌రెడ్డి

ఇల్లందకుంట/జమ్మికుంట, నవంబర్ 6: ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని, ప్రజా సంక్షేమానికి పట్టం కట్టాలని బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడికౌశిక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని వాగొడ్డురామన్నపల్లి, పాతర్లపల్లి, సిరిసేడు గ్రామాల్లో, జమ్మికుంటలోని 3,12,23,24 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కౌశిక్‌రెడ్డికి నాయకులు, ప్రజలు భారీ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల కోసం పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలన్నారు. ప్రజల సంక్షేమ కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రైతుల పంట పెట్టుబడి కోసం ₹19వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు చెప్పారు. రుణమాఫీ కాని రైతులకు త్వరలో రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ కింద ప్రతి ఇంటింటికీ నల్ల నీరు ఇస్తునట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కాల్వల ద్వారా పంటలకు సాగు నీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. దళితులు ఆర్థికంగా ఎదగాడానికి దళితబంధు పథకం ప్రవేశపెట్టామని, రెండో విడుత దళితబంధు రాని వారికి త్వరలో డబ్బు వేస్తామని పేర్కొన్నారు. రైతులకు రైతుబంధు తరహాలోనే పేదలకు రైతు బీమా వాటి పథకాలను ఇస్తున్నట్లు చెప్పారు. ఏడు సార్లు ఈటల రాజేందర్‌ను గెలిపించారని, ఈ ఒక్కసారి తనను గెలిపించాలని అభ్యర్థించారు. జమ్మికుంటను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రచారంలోశాలినీరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ విజయ, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్నాకోటి, కౌన్సిలర్లు రవీందర్, మల్లయ్య, నాయకులు దిలీప్, సదానందం, మాణిక్యం, సర్పంచులు పుట్ట రాజు, రాంమల్లయ్య, ఎంపీపీ పావని వెంకటేశ్, ఎంపీటీసీలు ఎక్కటి సంజీవరెడ్డి, చిన్నరాయుడు, మాజీ వైస్ ఎంపీపీ చుక్క రజింత్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచు బుర్ర రమేశ్, బీఆర్ఎస్ నాయకులు కుమార్, ముస్తాఫ, మొండయ్య, శ్రీకాంత్, కృష్ణ, ప్రమోద్, మురళి, తదితరులు పాల్గొన్నారు.



వాగొడ్డురామన్నపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, శాసన మండలి విప్ పాడికౌశిక్‌రెడ్డి